



WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

# విజయ కెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 23 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 199 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SUNDAY AUGUST 23 2026 | VOL:18 | ISSUE: 199 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## నల్లగొండ టూ టౌన్ కానిస్టేబుల్ షకీల్ కు బెస్ట్ అవార్డు.

**నల్లగొండ ఆగస్టు 22 విజయ కెరటం ప్రతినిధి**

నల్లగొండ పట్టణం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ షకీల్‌కు బెస్ట్ అవార్డు ఈరోజు అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సందీప్ శాండిల్య చేతుల మీదుగా అవార్డు అందుకున్న షకీల్ యువతను డ్రగ్స్ బారిన పడకుండా తన వంతు కృషిగా అహర్నిశలు కృషిచేసి డ్రగ్స్ బారిన యువత చెడిపోకుండా వారిని ఎల్లప్పుడూ టూ టౌన్ పరిధిలో ఎంతమంది యువత ఉన్నారో వారు ఏం చేస్తున్నారు వారి నడవడిక ఇవన్నీ అబ్జర్వేషన్ చేస్తూ




(మిగతా 2వ పేజీలో..)

## గచ్చిబౌలిలో కూలిన భవనం.. ఇద్దరి దుర్మరణం

**గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం**

**ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి**

**అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్టు గుర్తింపు**

క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా



(మిగతా 4వ పేజీలో..)

# తెలంగాణలో విద్యా, పరిశోధనకు కేంద్రంగా హైదరాబాద్

**యూనివర్సిటీ ప్రతినిధితో సీఎం రేవంత్ చర్చలు**

**హైదరాబాద్‌లో విద్యా వసతులపై విస్తృతంగా చర్చ**

**విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారానికి అవకాశం**

**అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాల నిర్వహణపై చర్చ**

**తెలంగాణను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడంపై దృష్టి**



హైదరాబాద్, ఆగస్టు 22 :

తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలకు చెందిన విద్యావేత్తలు, ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించడం, సంయుక్త

(మిగతా 2వ పేజీలో..)

## అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. డీఎంకే సంచలన నిర్ణయాలు..!

**డీఎంకే పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలక మార్పులు**

**బ్రాంచ్ పార్టీ కార్యదర్శి పదవికి గరిష్ఠ వయోపరిమితి 45 ఏళ్లు**

**మున్సిపల్, సిటీ, టౌన్ పంచాయతీ వార్డు కమిటీ కార్యదర్శులకు 50 ఏళ్ల పరిమితి**

కీలక పదవుల్లో ఎన్నికైన వారు గరిష్ఠంగా రెండు టర్ములు మాత్రమే

డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలక మార్పులు చేపట్టారు. పార్టీకి కొత్త రక్తాన్ని తీసుకురావడమే



(మిగతా 3వ పేజీలో..)

## మంత్రి కొండా సురేఖపై వేటుకు రంగం సిద్ధం?

**కుమార్తె వ్యాఖ్యల వివాదమే ప్రధాన కారణం**

**సురేఖను తప్పించాలని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్**

**సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చాక తుది నిర్ణయం**

తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేటు వేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యల వివాదం, పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో సురేఖను మంత్రివర్గం



(మిగతా 2వ పేజీలో..)

## నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..!

**విద్యావ్యవస్థలోని సమస్యలను తెలుసుకునేందుకు మంత్రి లోకేశ్ వినూత్న ప్రయత్నం**

**విద్యార్థులతో విద్యార్థిలా, ఉపాధ్యాయులతో ఉపాధ్యాయుడిలా మమేకం**

**విశాఖలో ఆధునికీకరించిన పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులతో సరదాగా ముచ్చట**

**లోకేశ్ ఆచరణాత్మక శైలిపై విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి హర్షం**

విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనుసరిస్తున్న వినూత్న పంథా అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయ

(మిగతా 4వ పేజీలో..)



## తెలంగాణ విద్యార్థులంటే లెక్కలేదా?.. రాహుల్ గాంధీపై కేటీఆర్, కవిత ఫైర్



**విద్యార్థులపై పోలీసుల చర్యలపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన కేటీఆర్, కవిత**

**ఢిల్లీలో ధర్నా చేసి, తెలంగాణ ఘటనలపై స్పందించకపోవడం ద్వంద్వ వైఖరి అని విమర్శ**

**మహబూబాబాద్‌లో విద్యార్థుల గొంతు పట్టుకున్న పోలీసుల వీడియోపై ఆగ్రహం**

**రేవంత్ రెడ్డి ఇంటి వద్ద రాహుల్ ధర్నా చేయగలరా అని కేటీఆర్ నిలదీత**

తెలంగాణలో విద్యార్థులపై పోలీసుల చర్యల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మౌనం వహించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

(మిగతా 2వ పేజీలో..)

## అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం

**అక్రమ నిర్మాణదారులను ఎవ్వరినీ వదలం**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ**

**హైదరాబాద్,ఆగస్ట్22**

అంజయ్యనగర్‌లోని అక్రమ నిర్మాణాలన్నీ తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఘట నాస్థలి పక్కన భవనాల వారు ఖాళీ చేసి



(మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### సర్టిఫికెట్లు ఆపేస్తున్న యాజమాన్యాలు...

# నలిగిపోతున్న విద్యార్థులు

విద్యార్థుల భవిష్యతు తో చెలగాటం.

తెలంగాణలో ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన వేలాది మంది విద్యార్థులు ఇప్పటికీ తమ డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు చేతికి రాకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించనందుకు విద్యార్థులను గ్రాఫ్ట్‌గా ఉపయోగించుకుంటున్నాయి. “ప్రభుత్వం డబ్బు ఇవ్వలేదు కాబట్టి మీరే చెల్లించండి... లేకపోతే సర్టిఫికెట్లు ఇవ్వం” అని మొండికేస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వం, కళాశాల యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారు. ఉద్యోగాలు, ఉన్నత విద్య, విదేశీ అవకాశాలు అన్నీ ఆగిపోయాయి. ఇది కేవలం ఒక పరిపాలనా వైఫల్యం కాదు... విద్యార్థుల భవిష్యత్తుపై జరుగుతున్న అన్యాయం.ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇంజనీరింగ్ చదవగలిగారు. కానీ ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయని యాజమాన్యాలు చెబుతున్నాయి. బకాయిలు వేల కోట్లల్లో ఉన్నాయని యాజమాన్యాలు ఫిర్యాదు చేస్తున్నాయి. అయితే ఈ బకాయిల భారాన్ని విద్యార్థులపైకి నెట్టడం ఎంతవరకు సమంజసం? హైకోర్టు స్పష్టంగా చెప్పింది--- కళాశాలలు సర్టిఫికెట్లను ఉంచుకోవడం చట్టవిరుద్ధం. అసలు సర్టిఫికెట్లు విద్యార్థుల సొంతం. ఫీజు బకాయిలు ఉన్నా చట్టపరమైన మార్గంలో రికవరీ చేయాలి. సర్టిఫికెట్లు ఆపేసి విద్యార్థులను బలవంతం చేయడం అన్యాయమని హైకోర్టు తేల్చి చెప్పింది. అయినా అనేక కళాశాలలు ఈ ఆదేశాలను పాటించడం లేదు. విద్యార్థుల ను బ్లాక్ మెయిల్ చేస్తున్నాయి. ప్రభుత్వం తో ఉన్న గొడవను విద్యార్థులకు రుద్దుతున్నారు. కళాశాల యాజమాన్యాలు చట్ట బద్దంగా ప్రభుత్వం తో పోరాడాలి తప్పా విద్యార్థులను ఈ వివాదం లోకి లాగడం సమంజసం కాదనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం, నిధుల విడుదలలో ఆలస్యం, విధాన మార్పులు---ఇవన్నీ విద్యార్థులను బలి చేస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్వాన్స్‌గా విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని ప్రకటించారు. ఇది సానుకూల అడుగు. కానీ గత బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? ఇప్పటికే కోర్సు పూర్తి చేసి సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి, కొందరు సంవత్సరాల తరబడి వేచి చూస్తున్న విద్యార్థులకు ఎప్పుడు న్యాయం జరుగుతుంది? ప్రకటనలు చాలు... ఆచరణ కావాలి.యాజమాన్యాలు కూడా తమ బాధ్యతను తప్పించుకోలేవు. విద్యార్థులను వేధించడం, సర్టిఫికెట్లు ఆపేయడం విద్యా సంస్థలకు తగిన ప్రవర్తన కాదు. ప్రభుత్వం డబ్బు ఇవ్వకపోతే యాజమాన్యాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. విద్యార్థులను గ్రాఫ్ట్‌గా ఉపయోగించకూడదు. హైకోర్టు ఆదేశాలు ఉన్నా వాటిని ఉల్లంఘించడం చట్టాన్ని తక్కువ చేయడమే.ఈ సమస్య కేవలం కొన్ని కళాశాలలకు, కొన్ని విద్యార్థులకు పరిమితం కాదు. వేలాది కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నాయి. ఉద్యోగం రాకుండా, ఉన్నత చదువులకు వెళ్లలేకుండా యువత భవిష్యత్తు చీకట్లో పడిపోతోంది. ప్రభుత్వం వెంటనే గత బకాయిలను చెల్లించాలి. కళాశాలలు సర్టిఫికెట్లు వెంటనే విడుదల చేయాలి. ఉల్లంఘించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భవిష్యత్తును బకాయిల పేరుతో నాశనం చేసుకోవడం నాగరిక సమాజానికి ఏమాత్రం తగదు. ప్రభుత్వం, యాజమాన్యాలు ఇకనైనా బాధ్యత తీసుకోవాలి. లేనిపక్షంలో ఈ నలిగిపోయే యువత భవిష్యత్తు మరింత చీకటవుతుంది. సహనం కోల్పోయిన విద్యార్థులు పోరు బయటపడితే కళాశాల యాజమాన్యాలు, ప్రభుత్వాలు తట్టుకోలేవు.

- సమీ, సీనియర్ జర్నలిస్ట్.

# నల్లగొండ టూ టౌన్ కానిస్టేబుల్ షకీల్ కుబెస్ట్ అవార్డు.

మొదటి పేజీ తరువాయి)

వారిని ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇప్పిస్తూ వారిని చెడు దారిన పోకుండా కాపాడుకుంటూ వచ్చాడు గతంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కూడా పనిచేసినప్పుడు డ్రగ్స్ పై పోరాటం చేశాడు ఇప్పుడు టూ టౌన్ లో కూడా అవే విధులు నిర్వహిస్తున్నాడు ఇతనికి అవార్డు రావడం వలన పోలీసు వారు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఇలాంటివి ఇంకెన్నో అవార్డులు అందుకోవాలని ప్రజల హర్షిస్తున్నారు ఇతను ఎప్పుడైనా తన పై అధికారులతో సఖ్యతగా మెలుగుతూ వారి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల్లో మమేకమై ప్రజల గుండెల్లో నిలిచాడు ఇతనికి అవార్డు వచ్చిన సందర్భంగా టూ టౌన్ సీఐ ఆదిరెడ్డి ఎస్సై డి సైదా బాబు హర్షం వ్యక్తం చేశారు

# తెలంగాణలో విద్యా, పరిశోధనకు కేంద్రంగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి)

పరిశోధనలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ప్రతినిధులు కొనియాడారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంద్రం ఆసక్తి చూపినట్లు తెలిపారు. తెలంగాణలో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు, పరిశ్రమలు, స్టార్టప్ పరిసర వ్యవస్థపై కూడా సమావేశంలో వివరించారు. అదేవిధంగా సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. తెలంగాణ యూనివర్సిటీల్లో ఉన్న ప్రతిభను ప్రపంచస్థాయి వేదికలకు తీసుకెళ్లేందుకు కేంద్రం సహకారం అందించడంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై విద్యావేత్తలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం

మొదటి పేజీ తరువాయి)

వెళ్లాలని రంగనాథ్ ఆదేశించారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన విషయం తెలియడంతో అక్కడకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతిచెందారని రంగనాథ్ తెలిపారు. బిల్డింగ్ యజమాని ఇంకా అందుబాటులోకి రాలేదని అన్నారు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి కొంతమంది ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తుల బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారని వివరించారు.నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోందని రంగనాథ్ అన్నారు. చుట్టుపక్కల ఉన్న భవనాలను పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తామని తెలిపారు. బిల్డర్ సాజిద్ 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. సాజిద్ పరారీలో ఉన్నారని చెప్పారు. 50 గజాల్లో ఈ బిల్డింగ్ నిర్మించారని వెల్లడించారు. హాస్టల్ బిల్డింగులను నిర్మించి.... రెంట్‌కు ఇస్తుంటాడని చెప్పారు. హైడ్రా ఈ ఘటన సహాయక చర్యల్లో పాల్గొంటుందని.... ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. శిథిలాల కింద అదృష్టవశాత్తూ ఇంకెవరూ ఉండకపోవచ్చని భావిస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు. అలాగే, ఈ ఘటన గురించి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడారు. గతంలోనే ఈ నిర్మాణాలపై తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నాలుగు నెలల క్రితమే ఈ నిర్మాణ పనులను ఆపేసి, సీజ్ చేశామని వెల్లడించారు. మళ్లీ నిన్న వర్క్ మొదలుపెట్టారని చెప్పారు. ఈరోజు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యామని అన్నారు. ఈ లోపు ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ నాలాను ఆక్రమించి నిర్మాణలు చేస్తున్నారన్నారు. ఈ బిల్డింగ్ చుట్టూ చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అన్నారు. హాస్టల్ బిల్డింగ్ కోసం ఈ నిర్మాణాన్ని చేపట్టారని సృజన తెలిపారు.

# మంత్రి కొండా సురేఖపై వేటుకు రంగం సిద్ధం?

మొదటి పేజీ తరువాయి)

నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ మేరకు అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుంది.కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డిని అహంకారిగా అభివర్ణిస్తూ, తెలంగాణ కాంగ్రెస్‌ను ‘తెలుగుదేశం కాంగ్రెస్’గా మార్చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసు ఇవ్వగా, తన కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని, వాటితో తనకు సంబంధం లేదని ఆమె బదులిచ్చారు. అయితే, కుమార్తె వ్యాఖ్యలను ఖండించకపోవడం, సీఎం పాల్గొన్న కార్యక్రమాలకు గైర్హాజరు కావడం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది.ఈ పరిణామాల మధ్య, ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలకు చెందిన సుమారు 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం సమావేశమయ్యారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి, పార్టీ నుంచి తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఇలయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం వంటి నేతలు మాట్లాడుతూ.. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంతర్గత విమర్శలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సురేఖపై చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. ఈ నిర్ణయాన్ని అధిష్ఠానం ఇప్పటికే సీఎంకు తెలియజేసింది. సీఎం తిరిగి రాగానే గవర్నర్‌కు సిఫార్సు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం తిరిగి రానున్నారు. ఆయన వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటారు.

# తెలంగాణ విద్యార్థులంటే లెక్కలేదా?..

# రాహుల్ గాంధీపై కేటీఆర్, కవిత ఫైర్

మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో విద్యార్థుల కోసం ధర్నా చేసిన రాహుల్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన తెలంగాణలో జరుగుతున్న దాడులపై స్పందించకపోవడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వారు ఆరోపించారు. శుక్రవారం కేటీఆర్ ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ రాహుల్ గాంధీ తీరును తప్పుబట్టారు. “దేశంలో రెండు రకాల భారతాలు ఉన్నాయి. ఒకచోట విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగితే రాహుల్ గాంధీ ప్రశ్నిస్తారు, ధర్నాలు చేస్తారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణలో విద్యార్థులను ఈడ్చుకెళ్తూ, గొంతు పట్టుకొని హింసిస్తున్నా పట్టించుకోరు. ఢిల్లీ తరహాలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తారా? లేక తెలంగాణ విద్యార్థులంటే మీకు లెక్కలేదా?” అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీ కవిత కూడా స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 19న మహబూబాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థి గొంతును ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పట్టుకున్న వీడియోను ప్రస్తావిస్తూ ఆమె విమర్శలు గుప్పించారు. “ఢిల్లీ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎఫ్ఐఆర్ కోసం వెళ్లిన రాహుల్, తెలంగాణ ఘటనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఇక్కడి విద్యార్థులను నేరస్థుల్లా చూస్తున్నారు. ఢిల్లీకి మీ ఆవేశం, తెలంగాణకు మీ మౌనం.. విద్యార్థులు మీ నుంచి ఇంతకంటే మెరుగైన తీరును ఆశిస్తున్నారు” అని కవిత అన్నారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

ఆగస్టు । ఆదివారం । 23 । 2026



# వరంగల్ మండల నూతన కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

**సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా పనిచేయాలని నాయకుల పిలుపు**

**వరంగల్ మండలం విజయ కెరటం ఆగస్టు 22:**



మాదిగ సమాజం ఆర్థిక అసమానతలను అధిగమించాలని మాదిగ సంక్షేమ పరిషత్ జాతీయ నాయకులు, వరంగల్ జిల్లా ఇంచార్జి వంగూరి ఆనంద్ రావు అన్నారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వరంగల్ మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల మండల సదస్సు నిర్వహించారు.శనివారం వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో లక్ష్మీపురం కమిటీ హాల్ లో ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ వరంగల్ మండల ఇంచార్జి కన్నెబోయిన ప్రమోద్ మాదిగ అధ్యక్షతన తూర్పు నియోజకవర్గ ఇంచార్జి గంగారపు మల్లన్న మాదిగ సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మాదిగ సంక్షేమ పరిషత్ జాతీయ నాయకులు, వరంగల్ జిల్లా ఇంచార్జి వంగూరి ఆనంద్ రావు మాదిగ, మాదిగ సంక్షేమ పరిషత్ మాజీ జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి ప్రణయ్ దీపు మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాజీ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ హాజరై వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగుతున్న ఆత్మగౌరవ ఉద్యమం, సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటాలను వివరించారు. సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



**మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల కమిటీ**

మండల అధ్యక్షులుగా : ఐత చంద్రమౌళి మాదిగ,అధికార ప్రతినిధి: చింత సతీష్ మాదిగ,ప్రధాన కార్యదర్శి: మోలుగురి శ్యామ్ మాదిగ,ప్రధాన కార్యదర్శి–2: ఇసంపెల్లి ప్రశాంత్ మాదిగ,ఉపాధ్యక్షులు: దౌడు నరేష్ మాదిగ,జన్ను కరుణాకర్,మామునూరి అనిల్ మాదిగ,సంక్షేమ పరిషత్ మండల కమిటీ:అధ్యక్షులు: వశపోతుల శ్రీనివాస్ మాదిగ,అధికార ప్రతినిధి: ఇసంపెల్లి బాబురావు మాదిగ,ప్రధాన కార్యదర్శి: ముత్యాల రవి మాదిగ,ఉపాధ్యక్షులు: కవ్వంపల్లి రవి మాదిగ, రాషపెల్లి అశోక్,జన్ను నాని,కార్యదర్శి: బిద్రు కొమురయ్య,సహాయ కార్యదర్శి: పుల్ల అంజిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

**మండల ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు**

వరంగల్ మండల నూతన కమిటీ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు ఐత చంద్రమౌళి మాదిగ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని సంఘం బలోపేతానికి, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని తెలిపారు.

# ప్రజల మనిషి సురవరం సుధాకర్ రెడ్

**నల్లగొండ ఆగస్టు 22 విజయ కెరటం ప్రతినిధి**



ప్రజల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నడిపిన ప్రజల మనిషి సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి ,ఎల్ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా నల్లగొండ మక్దూం భవన్ లో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నాయకుడిగా మొదలైన రాజకీయ ప్రస్థానం,సి.పి.ఐ.ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి గా నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా,జీవితమంతా రైతులు,కూలీలు, కార్మికుల మధ్యతరగతి ప్రజల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు. అణగారిన వర్గ ప్రజల హక్కులకై నిరంతరం పోరాటాలు సాగించారు. నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల కోసం డిండి నుండి నల్లగొండ వరకు పాదయాత్ర నిర్వహించి ఫ్లోరైడ్ సమస్యల పై పార్లమెంట్లో సుధీర్ఘ ఉపన్యాసం చేసి దేశ ప్రజల ను నల్గొండ వైపు తిప్పిన వ్యక్తి అన్నారు.అహర్నిశలు ఉద్యమ పోరాటాలతో పాటు పార్టీ పటిష్టత కోరకు తుది శ్వాస వరకు వారు చూపిన పోరాట పటిమ రాబోయే తరాలకు దిక్సూచి గా ఉంటుందని అన్నారు .నల్లగొండ జిల్లాతో వారికి విడదీయాలేని బంధం ఉందని, పెండింగ్ ప్రాజెక్టుల కోసం పాదయాత్రలు, అనేక ప్రజా సమస్యల పరిష్కారం తుది శ్వాస వరకు పోరాడిన గొప్ప నేత అని అన్నారు.వారు లేని లోటు , లౌకిక,ప్రజాస్వామ్య శక్తులకు తీరని లోటు అని అన్నారు .పార్లమెంట్లో లేబర్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా కార్మికులకు ఉపయోగపడే అనేక కార్మిక చట్టాల రూపకల్పన జీవం పోసారని అన్నారు. వారి జీవితం భావితరాలకు ఆదర్శంగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి నాయకులు ముండ్ల ముత్యాలు ఎం నందం ,కె నారాయణ, కే ప్రద్యుమ్న రెడ్డి,యూసుఫ్, బాసాని వెంకటయ్య, సీతారాములు కౌసల్య ,విజయ వీరయ్య , తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. డీఎంకే సంచలన నిర్ణయాలు..!

మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంగా పలు కీలక పదవులకు వయోపరిమితి విధించడంతో పాటు.. వరుసగా రెండు పర్యాయాలకు మించి ఆ పదవుల్లో కొనసాగకుండా కొత్త నిబంధనలు తీసుకొచ్చారు.చెన్నైలో జరిగిన డీఎంకే కార్యవర్గ సమావేశంలో ఈ మార్పులకు సంబంధించిన తీర్మానాలకు ఆమోదం లభించింది. ఈ సంస్కరణలు పార్టీ సంస్థాగత వ్యవస్థలో కొత్త నాయకత్వానికి అవకాశం కల్పిస్తాయని డీఎంకే వర్గాలు పేర్కొన్నాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి పార్టీ వర్గాల్లో కొత్త ఉత్సాహం నింపుతాయని భావిస్తున్నారు.కొత్త నిబంధనల ప్రకారం బ్రాంచ్ పార్టీ కార్యదర్శి పదవికి గరిష్ఠ వయోపరిమితిని 45 ఏళ్లుగా నిర్ణయించారు. మున్సిపల్, సిటీ, టౌన్ పంచాయతీ వార్డు కమిటీ కార్యదర్శుల వయసు 50 ఏళ్లకు మించకూడదు.టౌన్ పంచాయతీ పార్టీ కార్యదర్శులు, ఏరియా కమిటీ కార్యదర్శులు, సిటీ కమిటీ కార్యదర్శులకు గరిష్ఠ వయోపరిమితిని 60 ఏళ్లుగా నిర్ణయించారు. జిల్లా పార్టీ కార్యదర్శుల పదవికి అత్యధికంగా 70 ఏళ్ల వరకు వయోపరిమితి విధించారు.ఈ పదవుల్లో ఎన్నికైన వారు గరిష్ఠంగా రెండు టర్మ్ లు మాత్రమే కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. దీంతో పార్టీ పదవుల్లో కొత్తవారికి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.స్థానిక సంస్థాగత విభాగాల నిర్మాణంలోనూ డీఎంకే మార్పులు చేసింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో ఒక్కో ఏరియా కమిటీ పరిధిలో సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా నిర్ణయించారు. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ సంఖ్యను 30 వేలుగా నిర్ణయించారు. సిటీ కమిటీల పరిధిలో కూడా సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా తీర్మానం చేశారు.ఈ మార్పులను డీఎంకే ఎంపీ పి. విల్సన్ స్వాగతించారు. ఇవి పార్టీ సంస్థాగత వ్యవస్థలో మంచి నిర్మాణాత్మక సంస్కరణలని, అందరికీ మేలు చేసే నిర్ణయాలని ఆయన పేర్కొన్నారు.



## రాజా బహదూర్ రామిరెడ్డి సేవలు చిరస్మరణీయం..

**హైదరాబాద్ ఆగస్టు 22 విజయ కెరటం కరస్పాండెంట్**



చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి..

హైదరాబాద్, ఆగస్టు 22: రాజా బహదూర్ రామిరెడ్డి 157వ జయంతి వేడుకలు నారాయణ గూడలోని రెడ్డి ఉమెన్స్ కళాశాలలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రాంగణంలోని రాజా బహదూర్ రామిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం విద్యార్థినీల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ..!

నిజాం పాలన కాలంలో తెలంగాణలో విద్యాభివృద్ధికి రాజా బహదూర్ రామిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన దూరదృష్టితో ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, హాస్టళ్లు నేటి తరానికి నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని తెలిపారు.యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలు, జల్సాలు––విలాసాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, శారీరక వ్యాయామం, క్రీడా కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.కొండమల్లేపల్లి ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య ఘటన అత్యంత బాధాకరమని, విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించే బాధ్యత అందరిపైనా ఉందని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో హైదరాబాద్ మహిళా విద్యాసంఘం కార్యదర్శి ముత్యం రెడ్డి, రెడ్డి ఉమెన్స్ కళాశాల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అచ్యుత దేవి, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బ్యూటిషన్ కోర్సు

**నల్లగొండ ఆగస్టు 22 విజయకెరటం ప్రతినిధి :**

దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ( మహిళా ప్రాంగణం) యందు బ్యూటిషన్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నాయని జిల్లా మేనేజర్ ఆర్ మమత ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తిగల జనరల్ మహిళలు, స్కూలు మధ్యలో ఆపేసిన మహిళలు , ఒంటరి మహిళలు, డిజేబుల్ మహిళలు ( అంగవైకల్యం కలవారు) యోగ్యత పత్రము జిరాక్స్ కాపీ,పాసుపోర్టు సైజ్ ఫోటోలు రెండు కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) నల్లగొండ కార్యాలయం సంప్రదించగలరని, ఇట్టి ఉచిత శిక్షణ తరగతులు 2/9/2026 నుండి ప్రారంభమవుతాయని తెలిపారు ఈ కోర్సు కు 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు మహిళలు అప్లై చేసుకోవాలని దీనికి విద్యార్హత పదవ తరగతి వరకు ఉండాలని కాలవ్యవధి 30 రోజులుగా తెలిపారు , ఇట్టి అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని,మరిన్ని వివరాల కొరకు 7660022517,08682-24416 ఈ నెంబర్కు సంప్రదించగలరని జిల్లా మేనేజర్ ఆర్ మమత తెలియజేశారు

## 24 నుండి ఆటో ల నిరవధిక సమ్మె కు సీపీఎం మద్దతు

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . ఆగస్టు 22 . విజయ కెరటం .**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆటో ఉ యాప్ ఆధారిత సంఘాల జె.ఎ.సి ఆధ్వర్యంలో ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేవరకు ఆగస్టు 24 నుండి జరుగుతున్న నిరవదిక సమ్మె కు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆపార్టీ పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య తెలిపారు.శనివారం ఆటో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సుందరయ్య భవన్లో సిపిఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్యకు సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యానికి ఇ.వి. ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని, ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్, ర్యాపిడో యాప్లకు బదులుగా ప్రభుత్వమే ఒక కొత్త యాప్ను తెచ్చి ఉపాధి కాపాడాలని కోరారు.ఓలా, ఊబర్, ర్యాపిడో ద్వారా నడస్తున్న టూవీల్లర్లను నిషేధించాలని, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇవ్వాలని,ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లెసెన్స్ పాత పద్దతిలోనే ఇస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సారధి పరివాన్ యాప్లో లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చోరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఆటో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి బొమ్మిడి నగేష్, బి ఆర్ టి యు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కలగొని యాదయ్య గౌడ్, ఐఎన్టియుసి ఆటో యూనియన్ నాయకులు తాడేపల్లి దశరథ భాషాపాక యాదయ్య చాగంటి రాములు, గుంటూరు సైదులు హనుమంతు నాయక్ రావుల వీరేశం దాసరి నర్సింగ్ యాదవ్ పాష తదితరులు పాల్గొన్నారు



విజయకెరటం
తెలుగు దినపత్రిక

## డిప్యూటీ సీఎం చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్

**నల్లగొండ ఆగస్టు 22 విజయ కెరటం ప్రతినిధి**



ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భం గా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ది హాన్స్ ఇండియా ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇండియా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జాతీయస్థాయి మీడియా ఎడిటర్ల చేతుల మీదుగా శ్రీనివాస్ గౌడ్ అవార్డును స్వీకరించారు.

## గచ్చిబౌలిలో కూలిన భవనం.. ఇద్దరి దుర్మరణం

మొదటి పేజీ తరువాయి)

కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. 'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

## నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..!

మొదటి పేజీ తరువాయి)

పర్యటనలకు భిన్నంగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఆయన నేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమవుతున్నారు. వారిలో ఒకరిగా కలిసిపోయి, సమస్యలను అడిగి తెలుసుకుంటూ అక్కడికక్కడే పరిష్కారాలకు చొరవ చూపుతున్నారు. "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" రూపకల్పనే లక్ష్యంగా ఆయన చేస్తున్న ఈ ప్రయత్నం విద్యావర్గాల్లో కొత్త ఆశలు రేపుతోంది.విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ సంస్థ సహకారంతో ఆధునీకరించిన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. గతంలో తాను ఈ పాఠశాలను సందర్శించినప్పుడు క్రీడా మైదానం మోకాలి లోతు నీటిలో ఉండటాన్ని గమనించారు. విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని, దివీస్ యాజమాన్యంతో మాట్లాడి అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలను అభివృద్ధి చేసేలా ఒప్పించారు. నేడు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారిన తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆధునాతన ప్లేగ్రౌండ్‌ను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ప్రసంగాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు మైక్ అందించి వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు. వారు అడిగిన సరదా ప్రశ్నలకు అంతే ఉత్సాహంగా సమాధానాలిచ్చి వారిలో ఒకరిగా కలిసిపోయారు.అనంతరం విజయనగరం పర్యటనలోనూ లోకేశ్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. దాసన్నపేట బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అక్కడ ఉపాధ్యాయులకు కెమిస్ట్రీపై పునశ్చరణ తరగతులు జరుగుతుండగా, వారికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా నిశ్శబ్దంగా వెళ్లి ఉపాధ్యాయుల మధ్య కూర్చున్నారు. శ్రద్ధగా పాఠం వింటూనే, విరామ సమయంలో వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన అంశాలపై తక్షణమే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కార మార్గాలను అన్వేషించారు. మంత్రి హోదాను పక్కనపెట్టి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు లోకేశ్ అనుసరిస్తున్న ఈ ఆచరణాత్మక విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమస్యల పరిష్కారం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని అభిప్రాయపడుతున్నారు.

# చిన్నారుల రక్షణ-అందరి బాధ్యత

- **జిల్లా జడ్జి లక్ష్మీ శారద, జిల్లా కలెక్టర్ తేజస్**

**సూర్యాపేట (విజయ కెరటం సీనియర్ పాత్రికేయుడు గౌస్)**





సమాజంలో చిన్నారులకు సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ పి.లక్ష్మీ శారద స్పష్టం చేశారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు (జిల్లా బాలల పరిరక్షణ అధికారులు) నిర్వహించిన ఒక రోజు అవగాహన సదస్సును జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహలతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి పి.లక్ష్మీ శారద మాట్లాడుతూ.ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ దశలో పిల్లలకు కేవలం తిండి, నిద్ర, చదువు మాత్రమే సరిపోవని.. వారి మానసిక, భావోద్వేగ ఎదుగుదలకు తగిన ప్రేమ, సంరక్షణ, సమాన అవకాశాలు అందించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కు, ఆరోగ్యం, రక్షణను ప్రతి బాలుడికి అందేలా చూడాలన్నారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కోరారు. అదే సమయంలో మగపిల్లలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వారి సమస్యలను తెలుసుకుని తగిన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.

పాఠశాలల్లో నమ్మకమైన వాతావరణం ఉండాలి..

బడిలో విద్యార్థులు తమ సమస్యలను భయం లేకుండా ఉపాధ్యాయులతో పంచుకునేలా నమ్మకమైన వాతావరణాన్ని సృష్టించాలని జడ్జి సూచించారు. సమాజంలో ఉన్న దురాచారాలు, వేధింపుల నుంచి పిల్లలను కాపాడటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ బడులు, వసతి గృహాల్లో పిల్లల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల ఆలోచనా విధానం రూపుదిద్దుకునే దశ అని.ఈ సమయంలో వారిపై సోషల్ మీడియా, ఇంటర్నెట్ ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు గమనించాలని సూచించారు. తరగతి గదుల్లో హింస, వేధింపులు వంటి వాటిని గుర్తించి బాధితులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పాఠశాల ప్రార్థనా సమయాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వడం, వివిధ బాధ్యతలు అప్పగించడం ద్వారా పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించవచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, గురుకులాల ఒప్పందం ప్రకారం ఎంపిక చేసిన ఉపాధ్యాయులను చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా గుర్తిస్తూ ఈ అవగాహన సదస్సులునిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. డ్రగ్స్ కల్చర్‌కు దూరంగా ఉండాలి జిల్లా ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ. పోలీస్ శాఖ ద్వారా మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పోలీస్ భరోసా, పోలీస్ అక్క, షీ టీమ్స్ వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయని వివరించారు. చిన్నారులు ఎలాంటి వ్యసనాలకు, డ్రగ్స్‌కు లోనుకాకుండా జాగ్రత్తపడితేనే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హితవు పలికారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఫర్హీన్ కౌసర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మమత, జువెనైల్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అపూర్వ రవళి, జిల్లా అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రవికుమార్, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎం. స్రవంతి, డీడబ్ల్యూఓ నరసింహారావు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నాన్నా.. నువ్వే నా తొలి హీరో: రామ్ చరణ్

**మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రామ్ చరణ్**

**నాన్నే తన తొలి హీరో, గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్న చరణ్**

**తనపై నాన్న ఉంచిన నమ్మకమే అతిపెద్ద బలమని వెల్లడి**

**సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ సందేశాన్ని పంచుకున్న గ్లోబల్ స్టార్**

మెగాస్టార్ చిరంజీవి శనివారం (ఆగస్టు 22) తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో, ఆయన తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి సోషల్ మీడియా వేదికగా అత్యంత హృద్యమైన రీతిలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తన జీవితంలో తండ్రి స్థానం ఏమిటో వివరిస్తూ చరణ్ పెట్టిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది.ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో చరణ్ ఓ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్నా. మీరే నా మొదటి హీరో, నా అతిపెద్ద స్ఫూర్తి. ప్రతి విషయంలో నేను సంప్రదించేది మిమ్మల్నే. నా జీవితంలోని ప్రతి ఎత్తుపల్లంలో మీ ప్రేమ, మార్గదర్శకత్వం, నాపై మీరు ఉంచిన నమ్మకమే నాకు అతిపెద్ద బలంగా నిలిచాయి. మీరు నా జీవితంలో ఉండటం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మీకు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం కలగాలని, మరెన్నో అద్భుతమైన సంవత్సరాలు గడపాలని కోరుకుంటున్నాను. మాటల్లో చెప్పలేనంత ప్రేమతో... నాన్నా" అని రాసుకొచ్చారు.తండ్రిపై తనకున్న ప్రేమను, గౌరవాన్ని రామ్ చరణ్ ఎన్నో సందర్భాల్లో చాటుకున్నారు. తాజాగా ఆయన చేసిన ఈ పోస్ట్ తండ్రీకొడుకుల మధ్య ఉన్న బలమైన అనుబంధాన్ని, తన ఎదుగుదలలో చిరంజీవి పాత్ర ఎంత కీలకమో మరోసారి స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం రామ్ చరణ్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మెగా అభిమానులు ఈ పోస్ట్‌ను విస్తృతంగా షేర్ చేస్తూ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAK-SOOD AHAMED MOHAMED Cell: 9908408528